క్లుప్తంగా

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా దేవి అమ్మవారికి శుక్రవారం కొబ్బరి కాయలు సమర్పించారు. ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరి కాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అనంతరం శ్రీశైలంలోని అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు శ్రీశైల గిరిప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా శనివారం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం సంప్రదాయబద్ధంగా నిర్వహించనుంది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం గిరిప్రదక్షిణ ప్రారంభిస్తారు. ఆలయ మహాద్వారం నుంచి గంగాధరమండపం, అంకాళమ్మ ఆలయం, నంది మండపం, గంగాసదనం మీదుగా బయలువీరభద్రస్వామి ఆలయం వద్దకు చేరుకుంటుంది. అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం, అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపైకి చేరుకుంటుంది. అక్కడి నుంచి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం వద్దకు చేరుకుంటుంది. హేమారెడ్డి మల్లమ్మ మందిరం నుంచి మహిషాసురమర్దిని, రుద్రాక్షమఠం, విభూతిమఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంటుంది. రుద్రవనం నుంచి నందిమండపం వద్దకు రావడంతో గిరి ప్రదక్షిణ ముగుస్తుంది.

గుర్తింపుకార్డులు పొందండి

ఆత్మకూరు: కౌలురైతులు తప్పనిసరిగా కౌలుకార్డును పొందాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆయన మాట్లాడుతూ మండలంలో 900 మందికి పైగా కౌలు రైతులు ఉన్నారని, వీరికి కౌలు కార్డులు లేవని తెలిపారు. దీంతో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, పంట నష్టపరిహారం, పంటలబీమా తదితర పథకాలను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

పల్లకీలో విహరించిన ఆది దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవను ఆలయ సూపరింటెండెంట్ దేవిక, ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, శాంతారామ్ భట్ నిర్వహించారు.

అక్రమ కనెక్షన్లు తొలగింపు

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో ట్రాన్స్‌కో ఏడీ రామసుబ్రహ్మణ్యం, ఏఈలు అబ్దుల్ అబీద్, గోవింద్ రెడ్డి శుక్రవారం తనిఖీలు నిర్వహించి అక్రమ కనెక్షన్లను తొలగించారు. 12 మంది అక్రమంగా విద్యుత్ వినియోగించడంతో వారిపై కేసు నమోదు చేశారు. పది మంది మొండిబకాయి దారుల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

మహానందీశ్వరుడికి డీఓఎం పూజలు



మహానంది: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసింహులు దంపతులు శుక్రవారం కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. డీఓఎంకు ఆలయ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. వారి వెంట నంద్యాల మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, వైద్యుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ విజయ్‌శంకర్ ఉన్నారు.

బెల్లంఊట ధ్వంసం

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురానికి రెండు కి.మీ. దూరంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం నాటుసారా స్థావరంపై దాడులు నిర్వహించి 1,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. డీటీఎఫ్ సీఐ లక్ష్మణ్‌దాస్, ఎస్ఐ రమేష్, ఆత్మకూరు ఎస్ఐ జగదీష్ తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. సిద్ధాపురం గ్రామానికి చెందిన దేరంగుల మల్లికార్జున, పీటల రవికుమార్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

నాటుసారా సారా స్వాధీనం

నందికొట్కూరు: జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామంలో గువ్వల నాగశేషులును అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటు సారా, పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌లో రవీంద్రగౌడ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్ఐలు జఫ్రుల్లా, బాష్యం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నిందితుడి వివరాలు విలేకరులకు వెల్లడించారు.

భారత తొలి సామాజిక తత్వవేత్త

ప్రథమ సామాజిక తత్వవేత్త జ్యోతిరావుపూలే

మహాత్మా జ్యోతిరావు పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన జయంతిని నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి సేవలను గుర్తు చేసుకుని ఆయన అడుగుజాడల్లో నడుద్దామని ప్రతినబూనారు.

- నందికొట్కూరు, శ్రీశైలం నియోజక వర్గాల్లో ఘనంగా జయంతి వేడుకలు
- పూలే విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆత్మకూరు: మహాత్మా జ్యోతిరావుపూలే సేవలు మరువలేనివని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడుయాదవ్, శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షులు వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజులు అన్నారు. సంగమేశ్వర సర్కిల్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి శుక్రవారం వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యులు నాగన్న, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, గౌరవాధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాలస్వామియాదవ్, పట్టణ అధ్యక్షులు శ్రీహరి, ఉపాధ్యక్షులు వీరన్న, ఫారెస్ట్ డీఆర్వో వెంకటరత్న, బొల్లు నాగేష్‌యాదవ్, వడ్డెర సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

- **బండిఆత్మకూరు:** మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: పట్టణంలోని కేజీ రోడ్డుపై ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే జయసూర్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహారాష్ట్రలోని సతారా జిల్లాలో వ్యవసాయ తోటమాలి కుటుంబంలో జన్మించిన పూలే మానసిక బానిసత్వం నుంచి శూద్రులను కాపాడేందుకు త్రితీయ రత్న నాటకాన్ని రచించిన గొప్ప మేధావి అన్నారు. సమాజంలో పాతుకపోయిన మూఢ నమ్మకాలను, బ్రాహ్మణ ఆధిపత్యాన్ని వ్యతిరేకించిన మొదటి వ్యక్తి జ్యోతిరావుపూలే అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, సీపీఐ (ఎంఎల్)నాయకులు వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు రఘురామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

వెలుగోడు: జ్యోతిరావు పూలే జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వేంపెంట సర్కిల్‌లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి జాతీయ బీసీస సంక్షేమ సంఘం నాయకులు పూల మాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, నాయకులు అంకన్న, నారాయణ, రాఘవేంద్ర ఇంతియాజ్, రాము, మధుబాబు, రంగయ్య, రవికుమార్, శేఖర్ పాల్గొన్నారు.

- వెలుగోడు మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

- **పాములపాడు:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతీరావు పూలే అని డాక్టర్ నాగన్న, కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఆర్ఎస్ఆర్ గోపాల్ అన్నారు. మహనీయుని జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలోనూ జయంతి వేడుకలు నిర్వహించారు. సర్పంచు మౌలాలి, బీసీ సంఘం నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూల మాల వేసినివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ

- **పగిడ్యాల:** మహాత్మా జ్యోతీరావు పూలే సేవలు ఆదర్శనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మహనీయుని జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రసిద్ధ సామాజిక కార్యకర్త, ఆలోచనాపరుడు, కుల వ్యతిరేక సంఘ సంస్కర్త, రచయిత అయిన పూలే.. అంటరానితనం నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారన్నారు.



సింగరాజు పల్లిలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

- **కొత్తపల్లి:** సింగరాజు పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అంటరానితనం నిర్మూలించడానికి తన జీవితాంతం కృషి చేశారన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించండి



మాట్లాడుతున్న కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివనాగరాణి

ఆత్మకూరు: ఉపాధి కూలీలకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివనాగరాణి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కరివేన గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలపై ఆమె వివరాలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న జీపుజాతా కార్యక్రమంలో వ్యవసాయ కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ నెల నుంచి ఉపాధి కూలీలకు పలు గ్రామాల్లో వేతనాలు చెల్లించలేదని, దీంతో కూలీలు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలసలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారని, ఇప్పటికైనా వారికి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేశ్వరరావు, నరసింహనాయక్, బాలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

పాములపాడు: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై శుక్రవారం ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం జుమ్మా నమాజు అనంతరం జామియా, హస్మి మసీదుల నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మౌలానాలు సుభాన్, ఆరీఫ్ మాట్లాడుతూ మైనార్టీల హక్కులకు ముప్పు తలపెట్టడమే వక్ఫ్ చట్ట సవరణ అన్నారు. కేంద్రప్రభుత్వం వెంటనే సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ముస్లింలతో పాటు సీపీఐ నాయకుడు రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు షాజహాన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు సామన్న పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా సాంబిరెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎ.సాంబిరెడ్డిని నియమిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఎంపిక పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, పెన్షనర్లు హర్షం వ్యక్తం చేశారు.

మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష వాయిదా

జూపాడుబంగ్లా: ఈనెల 20న జరగాల్సిన మోడల్ స్కూల్ ప్రవేశపరీక్షను 21వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 20న ఈస్టర్ పండుగ ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం మరుసటి రోజుకు పరీక్షను వాయిదా వేసిందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. హాల్‌టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

తీర్మానం లేకుండా తొలగించారు

నందికొట్కూరు: గ్రామ సంఘం తీర్మానం లేకుండా ఏపీఎం శ్రీనివాసులు తమను తొలగించారని మండల పరిధిలోని మల్యాల గ్రామానికి చెందిన జీవనజ్యోతి, దివ్య సంఘాల వీఓఏలు శ్రీరాములు గౌడ్, షఫి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు ఐకేపీ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు.

ఆత్మకూరులో 36.6 మి.మీ. వర్షపాతం



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

ఆత్మకూరు: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వేకువజాము వరకు 36.6 మి.మీ. వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వారం క్రితం మూడు రోజులపాటు వరిసిన వర్షాలకు మొక్కజొన్న, పొగాకు, మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరోసారి అకాల వర్షం కురవడంతో చేతికందే దశలో ఉన్న పంటలు దెబ్బతినే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా మరో ఐదు రోజుల పాటు రాయలసీమలో విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది

- **మహానంది:** తమ్మడపల్లె, బొల్లవరం గ్రామాల పరిధిలో గాలి వానకు నేలకొరిగిన వరి పంటలను వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. వెయ్యి ఎకరాల్లో వరి పైరు పడిపోయినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు వారు తెలిపారు. అలాగే జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, మండల ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ మండలంలో పర్యటించి 65 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు. నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

- ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చైర్మన్

శ్రీశైలంటెంపుల్: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపును తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనాన్ని రుచి చూశారు. జీతాలు రావడం లేదని వంట నిర్వాహకులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే సమస్యను ఉన్నతాధికారులకు ఫోన్ చేసి చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ తసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

సంక్షిప్తం

ధర్నాను జయప్రదం చేయండి

కొత్తపల్లి: పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో ఈనెల 15న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివ నాగరాణి, జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు కోరారు. శుక్రవారం వీరాపురం, కొత్తపల్లి, లింగాపురం, శివపురం, సింగరాజుపల్లి, బట్టువారిపల్లి, కొక్కెరంచ, నాగంపల్లి గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలయ్య, ఎన్ ప్రసాద్, సురేష్, నూర్ అహ్మద్, మంగయ్య, సత్య రాజు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలి

కొత్తపల్లి: ఏడు వారాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు వెంటనే ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తపల్లి గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట సీపీఐ నాయకులు నాగ శేషులు, వెంకటేశ్వర్లు, భీమలింగం భాస్కర్ ఉన్నారు.

నేడు అక్కమహాదేవి జయంతి

శ్రీశైలం టెంపుల్: అక్కమహాదేవి జయంత్యుత్సవాన్ని శనివారం శ్రీశైలంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవికి అభిషేకం, విశేషార్చనలు జరిపిస్తారు. 12వ శతాబ్దంలో కన్నడ ప్రాంతాన శివశరణులుగా ప్రసిద్ధి పొందిన మహాభక్తులలో అక్కమహాదేవి ఒకరు. ఈమె శ్రీశైల మల్లికార్జునునిలో ఐక్యం కావాలనే చిరకాల వాంఛతో జీవితపు చివరి రోజులను శ్రీశైలంలోనే గడిపింది. జయంతిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం నిత్యకళారాధన వేదికపై అక్కమహాదేవి జీవిత విశేషాలపై ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

నందికొట్కూరు: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రూరల్ సీఐ సుబ్రమ్మణ్యం సూచించారు. శుక్రవారం మిడుతూరు మండం చింతలపల్లి గ్రామంలో ఆయన తన సిబ్బందితో కలిసి పర్యటించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై కర్నూలుకు చెందిన యం.రాముడు భాగవతార్ వారిచే భక్తమార్కండేయపై హరికథా గానం నిర్వహించారు.

నేడు అందుబాటులో రిజిస్ట్రేషన్ సేవలు

ఆత్మకూరు/నందికొట్కూర్: రెండో శనివారం కూడా రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఆత్మకూరు, నందికొట్కూరు సబ్‌రిజిస్ట్రార్లు కరీంబాషా, ఎస్.ఎం మౌలా శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సేవలు కొనసాగుతాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

13న గురుకుల ప్రవేశపరీక్ష

జూపాడుబంగ్లా: ఈనెల 13న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు జూపాడుబంగ్లా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. హాల్‌టికెట్లపై ఫొటో సక్రమంగా లేని విద్యార్థులు ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు.

గరుడ వాహనంపై విహరించిన శ్రీలక్ష్మీరంగనాథుడు





ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి, అమ్మవారు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం స్వామివారు గరుడ వాహనంపై గ్రామ పురవీధుల్లో విహరించారు. ముందుగా స్వామివారి మూల విగ్రహానికి, ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచారు. బోయీలు పల్లకీని మోస్తూ గ్రామోత్సవ వాహనం వరకు తెచ్చారు. ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి స్వామివారికి సాష్టాంగ నమస్కారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోవిందనామస్మరణల మధ్య స్వామివారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. భక్తులు కొబ్బరి కాయలు, కర్పూరహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గుండు, చందా ఎత్తేందుకు వివిధ గ్రామాలకు చెందిన వస్తాదులు పోటీపడ్డారు. విజేతలను స్వామివారి పూలమాలతో సత్కరించారు.

వైభవోపేతం.. గ్రామోత్సవం



గ్రామోత్సవంలో నూతన విగ్రహాలు

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో ప్రతిష్ఠించనున్న సుంకులాపరమేశ్వరి, జంబులా పరమేశ్వరి, గంగమ్మ, లింగమయ్య స్వామి, అమ్మ వార్ల నూతన విగ్రహాలకు శుక్రవారం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామం పొలిమేరలో దేవాలయాలు నూతనంగా నిర్మాణం చేపట్టారు.

ఈ సందర్భంగా పురోహితులు ప్రాతఃకాల పూజ, యంత్ర, విగ్రహ అభిషేకం, మహా స్వప్నవనము, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాలు, దీక్షా హోమం, గ్రామోత్సవం నిర్వహించారు. సాయంకాల ప్రదేశకాల పూజ, దీక్షా హోమాలు, ధాన్యాధివాసము, ఆదివాస హోమాలు, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామోత్సవంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని నూతన విగ్రహాలకు కాయ, కర్పూరాలు, పసుపు, కుంకుమలు సమార్పించారు. గ్రామంలో బంధువులు, మిత్రులతో సందడి వాతావరణం నెలకొంది.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్ఐ

జూపాడుబంగ్లా: తర్తూరు జాతరలో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం కేజీ రోడ్డు నుంచి తర్తూరు జాతరలోకి ఆర్టీసీ బస్సులు, లారీలు, ఎద్దుల బండ్లు, తదితర భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా రోడ్డు ఏర్పాటుచేసి దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు వెంట తర్తూరు జాతర నుంచి వచ్చే వాహనాలు బయటకు వచ్చేలా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జాతరకు నిత్యం వందలాది వాహనాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జాతరలోకి ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్లకుండా తర్తూరులోకి ప్రవేశించే గేటు వద్దే పార్కింగ్ ఏర్పాటుచేసి ట్రాఫిక్‌ను నియంత్రించనున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్టీసీ కంట్రోలర్ శ్రీనివాసులు ఉన్నారు.